సాక్షి
నిజామాబాద్
శనివారం ¦ 19 ¦ జూలై ¦ 2025



ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ సాయి చైతన్య అన్నారు. ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్‌ను నయం చేసుకోవచ్చన్నారు.

- 8లో ▸



మురుగునీరు..

మాక్లూర్ మండలంలోని మాణిక్‌భండార్ సమీపం నుంచి ప్రవహించే పులాంగ్ వాగు పూర్తిగా కలుషితమవుతోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /24.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ అడపాదడపా జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

స్థానికమే పరమార్థం

పొలిటికల్ హీట్

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో సందడి
- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై ఉత్కంఠ
- కాక పుట్టిస్తున్న నేతల మాటలు
- బాల్కొండ నియోజకవర్గంలో ఉద్రిక్త వాతావరణం
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల ప్రకటనలతో ఇతర ప్రాంతాల్లోనూ వేడి



జిల్లాలో రాజకీయం వేడెక్కింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగానే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అది అక్కడితో ఆగకుండా ఘర్షణ వాతావరణానికి దారి తీసింది. గల్ఫ్ కార్మికుల అంశంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య రగడ జరుగుతోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ముందుకెళుతోంది. ఇందులో భాగంగా బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ న్యాయ సలహాకు పంపేందుకు నిర్ణయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పొలిటికల్ హీట్‌తో కూడిన సందడి నెలకొంది. బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠగా ఎవరికి వారు లెక్కలేసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల వేడి మెల్లిగా మొదలై ఎన్నికల కోడ్ వచ్చే సమయానికి తారాస్థాయికి చేరుకుంటుందని అంతా అనుకుంటున్న నేపథ్యంలో పరిస్థితి మరోలా తయారవుతోంది. ఆర్డినెన్స్‌పై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం రాజకీయంగా గరంగరం వాతావరణం నెలకొంది. బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో వరుసగా చోటుచేసుకున్న పరిణామాలు ఘర్షణ వాతావరణానికి బీజాలు వేశాయి. భీమ్‌గల్‌లో మంత్రి జూపల్లి పర్యటన నేపథ్యంలో నెలకొన్న ఘర్షణ, తాజాగా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం వల్ల వేల్పూర్‌లో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు 163 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్టు అమలు చేసే వరకు వెళ్లింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా నిర్బంధించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన పలువురిని అరెస్టు చేశారు. ఈ రగడ ఇప్పటికీ చల్లారడం లేదు. గల్ఫ్ కార్మికుల అంశం కాస్తా అన్ని విషయాలపై ఇరుపార్టీలు పోటాపోటీగా ఎంచుకునే వరకు వచ్చింది.

■ వేల్పూర్ ఘటన నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పందించారు. అధికారం ఉంది కదా అని దాడులకు రావడం సరికాదన్నారు. ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొంటామని బాజిరెడ్డి స్పష్టం చేశారు. గల్ఫ్ కార్మికులకు ఏమీ చేయలేదని, అడిగితే దాడులకు దిగడమేమిటన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని పరామర్శించారు. దాడుల సంస్కృతి సరికాదన్నారు.

■ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం మరో ప్రకటన చేశారు. దీంతో మరింత కాక రేగుతోంది. గల్ఫ్ కార్మికుల విషయంలో ప్రశాంత్‌రెడ్డి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నంలో భాగంగా గల్ఫ్ కార్మిక కుటుంబాలకు పరిహారం ఇచ్చిన విషయాన్ని రుజువు చేసే ప్రయత్నం చేశామన్నారు. ప్రతిపక్షం విమర్శలు చేయొచ్చు కానీ గూండాలను దాడికి సిద్ధంగా ఇంట్లో ఉంచడమేమిటన్నారు. ప్రశాంత్‌రెడ్డి కంటే తనకు ఎక్కువ రాజకీయ అనుభవముందని మానాల అన్నారు. ప్రశాంత్‌రెడ్డి తమ్ముడు ఏం చేస్తున్నాడో, గతంలో మానాలలో ప్రశాంత్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టించిన విషయాలు అందరికీ తెలుసన్నారు. అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడితే నంగి దేవేందర్‌రెడ్డిపై దాడి చేసేవాళ్లా అన్నారు. ప్రతిపక్షాల స్వేచ్ఛను హరిస్తే తాను గృహనిర్బంధంలో ఉంటానా అని మానాల ప్రశ్నించారు.

■ ఇదిలా ఉండగా కమ్మర్‌పల్లిలో బాల్కొండ నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రెస్‌మీట్ పెట్టి ప్రశాంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. జిల్లావ్యాప్తంగా ఇరు పార్టీల నాయకులు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు.

రంగం సిద్ధం చేసుకుంటున్న బీజేపీ

జిల్లాలో ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ సైతం స్థానిక ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో రంగం సిద్ధం చేసుకుంటోంది. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసేందుకు అర్వింద్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బలంగా ఉన్న బీజేపీ, అధికార కాంగ్రెస్‌ను బలంగా ఢీకొట్టేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటోంది. దీంతో ఇక్కడ సైతం రెండు జాతీయ పార్టీల మధ్య నువ్వా నేనా అనేలా పోటీ నెలకొనే పరిస్థితి ఉందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మె ల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. నగరంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నారై సెల్‌పై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నిలదీశారన్నారు. ఇచ్చిన హామీని ప్రశ్నించినందుకే వేల్పూర్ ఘటన చోటుచేసుకుందన్నారు. ఎమ్మెల్యే ఇంట్లోకి కాంగ్రెస్ నాయకుడు అక్రమంగా ప్రవేశించడమే కాకుండా వీడియోలు తీయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ నాయకుడిని వదిలేసి తమ కార్యకర్తలపై కేసులు వేయడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు దేశ, రాష్ట్ర అభివృద్ధిపై కాకుండా నాయకుల అభివృద్ధికి పాటుపడుతున్నాయని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



రామారెడ్డి: మండలంలోని స్కూల్‌తండాతో పాటు ఇందల్వాయి అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తోందని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఏలుసింగ్ మేరు స్పష్టం చేశారు. పులి కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నా జాడ కనిపించలేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్కూల్ తండా పరిధిలోని అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఆవుపై పెద్దపులి దాడి చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లో చాటింపు వేయించి పెద్దపులి సంచరిస్తున్న విషయాన్ని తెలియజేశామన్నారు. వారం రోజులుగా అటవీ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. అటవీ జంతువులకు హాని కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో నిఖిత హెచ్చరించారు. పులిపై విషప్రయోగం జరిపిన ఘటనలో ఇప్పటికే నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయాన్ని తెలిపారు. క్రూరమృగాలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచా రం అందిస్తే తొందరగా వాటిని పట్టుకునేందుకు వీలవుతుందన్నారు. వారం రోజులు గా వెతుకుతున్నా పులి కనిపించడం లేదంటే అది వెళ్లిపోయినట్లు కాదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ల హామీ మరిచిన కాంగ్రెస్ సర్కారు

- మందకృష్ణ మాదిగ



నిజామాబాద్‌అర్బన్: అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆసరా పెన్షన్ల హామీని విస్మరించిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. నగరంలోని లక్ష్మి కల్యాణ మండపంలో శుక్రవారం పెన్షన్‌దారుల దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ఆసరా పెన్షన్ రూ.2వేల నుంచి రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేల చేయూత పెన్షన్ ఇస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మరిచిపోయారని విమర్శించారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల సమితి నాయకులు బీరప్ప, సుజాత సూర్యవంశీ, మాదిగ రిజర్వేషన్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, కనక ప్రమోదు, మైలారం బాలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ముగిసిన శిక్షణ



నిజామాద్ రూరల్: కారుణ్య నియామకాల్లో భాగంగా కొత్తగా వచ్చిన జూనియర్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. పది రోజులపాటు వివిధ అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. జిల్లా పరిషత్ డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో సాయన్న మాట్లాడారు. ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఎస్టాబ్లిష్‌మెంట్, అకౌంట్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాసరావు, సునీత దేవి, భరత్, లింగన్న, శ్రీనివాస్, పంచాయతీరాజ్ జిల్లా మినిస్టీరియల్ సంఘ జిల్లా అధ్యక్షుడు గడ్డం భాస్కర్, సెక్రెటరీ ప్రదీప్‌కుమార్, ట్రెజరర్ విఠల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో 3వ శనివారం నిర్వహణ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ -1, 2 ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, ఆర్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముబారక్‌నగర్, తిలక్‌గార్డెన్, పవర్ హౌస్, మిర్చి కాంపౌండ్, అర్సపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాధవనగర్ వద్ద పూర్తిగా పడని గేటు.. అలాగే వెళ్తున్న రైలు



మొరాయించిన రైల్వే గేటు

- పూర్తిగా పడని గేటు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని మాధవనగర్ వద్ద రైల్వే గేటు మొరాయించడంతో అరగంటపాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వైపు (అకోలా- కాచిగూడ) రైలు వస్తోంది. దీంతో గేట్‌మన్ గేటు వేస్తుండగా మధ్యలోనే ఆగిపోయింది. ఒకవైపు రైలు వస్తుండడం, మరోవైపు గేటు పూర్తిగా కిందికి దిగకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులను ఆపేందుకు గేట్‌మన్ ముప్పుతిప్పలు పడ్డాడు. చివరకు తాత్కాలిక గేటును వేశాడు. కొందరు వాహనదారులు గేట్లకు మధ్యలోనే నిలిచిపోయారు. గమనించిన లోకో పైలట్ రైలును నెమ్మది చేశాడు. వెంటనే రైల్వే సిబ్బంది మాధవనగర్ చేరుకొని గేటు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- సాంకేతిక విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యం
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడేలా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సాంకేతిక విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలను శుక్రవారం ఎమ్మెల్యే, కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో సమావేశమై, ఒక్కో విభాగం వారీగా నమోదైన ఫలితాలు, అధ్యాపకుల ఖాళీలు, అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం తరగతి గదులు, వర్క్‌షాప్‌లను సందర్శించి, పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో భేటీ అయ్యి, వారికి అందిస్తున్న శిక్షణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వివిధ డిప్లొమా కోర్సులలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనా సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీలకు మౌలిక సదుపాయాలు, అవసరమైన బోధనా సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం ఉత్తీర్ణత సాధిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రతిభను కొలమానంగా గుర్తిస్తూ ఆయా సంస్థలు ఉపాధి కల్పిస్తున్నాయని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలలో నెగ్గుకురావాలంటే ప్రతిభను చాటాల్సిన ఆవశ్యకత నెలకొని ఉందన్నారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, బోధనా సిబ్బంది ఉన్నారు.

పెద్దాసుపత్రికి సుస్తీ

- సమస్యల వలయంలో జీజీహెచ్
- పని చేయని ఫ్యాన్లు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- కనిపించని హెల్ప్‌డెస్క్, ఆరోగ్యమిత్ర సిబ్బంది



జీజీహెచ్‌లో ఓపీ చీటీ ఇచ్చే ప్రాంతంలో పని చేయని ఫ్యాన్లు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పేరుకు పెద్దాసుపత్రి అయినా కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా జీజీహెచ్‌లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సమాచారం అందించాల్సిన హెల్ప్‌డెస్క్, ఆరోగ్యమిత్ర కౌంటర్లు సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నడవలేని స్థితిలో ఉండే రోగులను తీసుకెళ్లేందుకూ సిబ్బంది లేకపోవడంతో బంధువులే స్ట్రెచర్లపై తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిత్యం 1,800 నుంచి 1,900 వరకు ఓపీ నమోదవుతోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు అందించాల్సి ఉంటుంది. జిల్లా నుంచే కాకుండా నిర్మల్, కామారెడ్డి, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా వైద్య సేవల కోసం పేదలు జీజీహెచ్‌కు వస్తుంటారు. రోగాలతో బాధపడుతూ దవాఖానాకు వచ్చేవారు డాక్టర్ వద్దకు వెళ్లాలంటే కచ్చితంగా ఓపీ చీటీ ఉండాల్సిందే. ఓపీ చీటీ కోసం ఆరు కౌంటర్లు ఉన్నాయి. ఇందులో ఓ కౌంటర్ ఎప్పటికీ మూసి ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచే ఓపీ చీటీ కోసం రోగులు, వారి బంధువులు క్యూలో నిలబడాల్సి వస్తుంది. క్యూ లైన్లపై పేరుకే 8 ఫ్యాన్లు ఉన్నా ఒక్కటీ పనిచేయదు. రోగాలు నయం చేసుకునేందుకు వస్తే క్యూలైన్‌లో నిలబడి అవస్థలు పడాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూర్చోవడానికి సైతం సరిపడా కుర్చీలు లేవని వాపోతున్నారు.



హెల్ప్‌డెస్క్‌లో కనిపించని సిబ్బంది

✤ జీజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయం కోసం హెల్ప్‌డెస్క్, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ మిత్ర టేబుల్స్ ఉన్నా లేనట్టే. పేరుకు టేబుల్స్ ఉన్నా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. నిత్యం కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

✤ అనారోగ్యంతో నడవలేని రోగులు, కాళ్లు, చేతులు విరిగిన క్షతగాత్రులను వీల్‌చైర్, స్ట్రెచర్‌లపై బంధువులే వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారు. సిబ్బంది ఉన్నా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

ఫ్యాన్లు బాగు చేయించాలి



మా అమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకొచ్చాను. ఓపీ చీటీ కోసం నిలబడి ఉన్నాం. ఇక్కడ కూర్చోవడానికి సీట్లు లేవు. ఫ్యాన్లు కూడా పని చేయడం లేదు. ఉక్కపోత పోస్తుంది. – ఎండీ అర్బాస్, మాలపల్లి

సమస్యలు పరిష్కరించాలి



గంటకు పైగా క్యూలైన్‌లో నిలబడి ఉన్నాను. పంటి నొప్పి ఉండడంతో చూపించుకోవడానికి నా బిడ్డతో వచ్చాను. వేడికి తట్టుకోలేకపోతున్నాను. ఇక్కడ చీటీ దొరకడం చాలా కష్టంగా ఉంది. సహాయం అడుగుదామంటే హెల్ప్‌డెస్క్‌లో ఎవరూ లేరు. – భూదేవి, మైలారం

మరమ్మతులు చేయిస్తా..

ఫ్యాన్లు వెంటనే మరమ్మతు చేయిస్తాను. హెల్ప్‌డెస్క్‌లో సిబ్బంది ఉండాల్సిందే. రోగులను తీసుకెళ్లడానికి సహాయ సిబ్బంది ఉన్నారు. ఎవరి విధులు వారు నిర్వహించాల్సిందే. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయి. – డాక్టర్ రాములు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

ఉపాధి ఉద్యోగులకు వేతనాల తిప్పలు

- నెలల తరబడి నిలిచిన జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యోగులు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలు, ఇతర ఉద్యోగులకు మూడు నెలల నుంచి వేతనాలు జమ కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు కోసం ఇచ్చే నిధుల నుంచే రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను చెల్లించాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి నిధులు మంజూరైనా ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పేదరిక నిర్మూలన సంస్థ, ఉపాధి హామీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండు విభాగాల ఉద్యోగులు కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను పర్యవేక్షిస్తున్నారు. పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులకు క్రమం తప్పకుండా వేతనాలను చెల్లిస్తున్నారు. ఉపాధి చూపే ఉద్యోగులకు మాత్రం నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. ఉద్యోగుల వేతన చెల్లింపులపై 'సాక్షి' ఉన్నతాధికారులను వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని వెల్లడించారు. ఉద్యోగులు పడుతున్న ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో వేతనాలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

జిల్లాలో ఉపాధి ఉద్యోగులు	
ఏపీవోలు	20
కంప్యూటర్ ఆపరేటర్లు	36
ఇంజినీర్ కన్సల్టెంట్లు	11
టెక్నికల్ అసిస్టెంట్లు	67
ఫీల్డ్ అసిస్టెంట్లు	317
మొత్తం	451

ప్రభుత్వం స్పందించాలి

ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ ఉద్యోగులకు సక్రమంగా వేతనాలను చెల్లించాలి. నెలల తరబడి వేతనాల చెల్లింపులు నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలను మంజూరు చేయాలి. – సురేశ్‌బాబు, ఉపాధి ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి

జాప్యం చేయడం తగదు

ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు, నాలుగు నెలలుగా వేతనాలను చెల్లించకపోవడం సరైంది కాదు. ప్రభుత్వం పునరాలోచన చేసి వేతనాల కోసం గ్రాంటును విడుదల చేయాలి. అన్ని శాఖల ఉద్యోగుల మాదిరిగానే వేతనాలు ప్రతి నెలా చెల్లించాలి. – నర్సయ్య, ఏపీవోల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

‘చెక్‌డ్యాం’తో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని తాడెం గ్రామ సమీపంలోని వాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యాంతో నష్టపోతున్న రైతులను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్‌చేశారు. బాధిత రైతులతో కలిసి ఆమె శుక్రవారం నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్‌ ఏఈ శ్రీనివాస్‌తో సమావేశమై, అధికారులను నిలదీశారు. అనంతరం పద్మ మాట్లాడుతూ.. పనులు ఆపకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రైతు సంఘ ప్రతినిధులు కంజర భూమయ్య, అడ్డికె రాజేశ్వర్‌, రాధాకుమార్‌, రంజిత్‌కుమార్‌ పాల్గొన్నారు.

సాగుకు నీరు ఇవ్వండి



సుభాష్‌నగర్‌: వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరతతో జిల్లాలోని పంటలు బీడు వారిపోతున్నాయని, వెంటనే నిజాంసాగర్‌ కెనాల్‌ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి డిమాండ్‌చేశారు. ఈమేరకు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దినేష్‌ కులాచారి మాట్లాడుతూ.. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం సాగునీటిని షెడ్యూల్‌ ప్రకారం విడుదల చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే నిజాంసాగర్‌ కెనాల్‌ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్‌ ఎదుట ధర్నాలు, రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు. నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, పద్మారెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్‌ శంకర్‌, పంచరెడ్డి శ్రీధర్‌, ప్రమోద్‌, జగన్‌రెడ్డి, నారాయణ యాదవ్‌, శ్రీనివాస్‌రెడ్డిపాల్గొన్నారు.

నేడు జిల్లాకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌ రాక

నిజామాబాద్‌అర్బన్‌: నేడు జిల్లాకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌ రాజయ్య రానున్నారు. ఈసందర్భంగా ఆయన నేతత్వంలోని ఆర్థిక సంఘం సభ్యులు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొననున్నారు. సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాపై సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.

మురుగునీరు.. కెమికల్‌ నురగలు..

- కలుషితమవుతున్న పులాంగ్‌ వాగు
- ఆందోళన చెందుతున్న పశుపెంపకందారులు



జన్నేపల్లి వద్ద మురికినీరుతో ప్రవహిస్తున్న వాగు



మాక్లూర్‌ మండలంలోని పులాంగ్‌ వాగులో కెమికల్స్‌తో ఏర్పడిన నురగలు

మాక్లూర్‌: మండలంలోని మాణిక్‌భండార్‌ సమీపం నుంచి ప్రవహించే పులాంగ్‌ వాగు పూర్తిగా కలుషితమవుతోంది. దీంతో ఆ నీటిని సమీప గ్రామాల్లోని పశువులు తాగుతుండటంతో పశుపెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. కలుషిత వాగు నీటిని పశువులు తాగి మృతి చెందే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్‌ పులాంగ్‌ నుంచి మొదలైన వాగు మాక్లూర్‌ మండలంలోని మాణిక్‌భండార్‌, బొర్గాం(కె), కృష్ణనగర్‌, ముల్లంగి (బి), బొంకన్‌పల్లి, వల్లభాపూర్‌, జన్నేపల్లి, చిక్లి ద్వారా ప్రవహించి నవీపేట, నందిపేట మండలాల సరిహద్దులో ఉన్న గోదావరి నదిలో కలుస్తుంది. సుమారు 30 కిలోమీటర్ల పొడువునా ప్రవహించే ఈ వాగులో నగరంలోని మురుగుతోపాటు, సమీప గ్రామాల నుంచి వ్యర్థాలు చేరడంతో కలుషితమవుతోంది. అలాగే వాగు సమీపంలోని పలు రైస్‌మిల్లుల నుంచి కెమికల్స్‌ను వాగులోని వదలడంతో వాగు నీరంత విషపూరితంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్‌ సెంటర్ల నిర్వాహకులు రాత్రి సమయాల్లో వ్యర్థాలను తెచ్చి ఆకుల కొండూర్‌, పూలాంగ్‌, జన్నేపల్లి వంతెనల వద్ద పారవేస్తుండటంతో నీరు మరింత కలుషితం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పొరపాటున వాగు నీటిని తాకితేనే శరీరం మొత్తం దద్దుర్లు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. అలాంటి నీటిని పశువులు తాగితే మృతిచెందే అవకాశం ఉంటుందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాగులో వ్యర్థాలు కలువకుండా, నీరు కలుషితం కాకుండ తగినచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నా పాడి గేదె చనిపోయింది..



నాకు 10కి పైగా పాడిగేదెలు ఉన్నాయి. రోజూ పులాంగ్‌ వాగు పరిసర ప్రాంతాల్లోనే వాటిని మేపుతుంటాను. ఎంత దాహం వేసినా మురికి నీటిని గేదెలు తాగవు. కానీ రెండు నెలల క్రితం ఓ గేదె అధిక దాహంతో వాగులోని మురికి నీరు తాగి చనిపోయింది. అధికారులు స్పందించి, వాగును కలుషితం నుంచి కాపాడాలి.

– కుర్మ బీరయ్య, పశుపెంపకందారు, వల్లభాపూర్‌

కలుషిత నీటిని ఇవ్వొద్దు



కెమికల్‌, వ్యర్థాలతో కూడిన నీరు పశువులు తాగటం వల్ల పాడిగేదె కడుపు అంత విషపూరితం అవుతుంది. మేత కూడ తినదు. పశువులను అట్టి కలుషిత నీరు తాగకుండా చూసుకోవటమే ఉత్తమం. వల్లభాపూర్‌లో కుర్మ బీరయ్య పాడి గేదె కలుషితనీరు తాగి మృతి చెందింది. ఆ గేదెకు వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయింది.

– కిరణ్‌దేశ్‌పాండే, పశువైద్యాధికారి, మాక్లూర్‌

‘నిజాంసాగర్‌’ నీటిని విడుదల చేయాలి



ఎడపల్లి మండలం సాటాపూర్‌ గేట్‌వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

బోధన్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు డి–46 కాలువకు నీరు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎడపల్లి మండలంలోని సాటాపూర్‌ గేట్‌ వద్ద నిజామాబాద్‌ వెళ్లే ప్రధాన రోడ్డుపై ఎడపల్లి, బోధన్‌ మండలాల్లోని ఆయకట్టు రైతులు రాస్తారోకో నిర్వహించారు. డి–46 కాలువ ఎడపల్లి, బోధన్‌, రెంజల్‌ మండలాల్లో విస్తరించి ఉండగా, ఈ కాలువ కింద సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. రైతులు ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేశారు. వర్షాలు పడకపోవడం వల్ల కాలువ నీటి ఆధారంగా సాగు చేసిన వరి పైరు ఎండిపోయే పరిస్థితికి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరారు. సమాచారం అందుకున్న ఎడపల్లి ఎస్సై రమా, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమే

- ప్రశాంత్‌రెడ్డీ..! నాపై తప్పుడు ఆరోపణలు మానుకో
- డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి



నిజామాబాద్‌ సిటీ: అభివృద్ధిపై చర్చించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తనపై నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేయడం తగదని సూచించారు. ఇటీవల జరిగిన వేల్పూరు ఘటనపై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశాంత్‌రెడ్డి స్వగ్రామమైన వేల్పూర్‌లో గురువారం జరిగిన ఘటనలకు ప్రశాంత్‌రెడ్డే బాధ్యత వహించాలన్నారు. గల్ఫ్‌ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ప్రశాంత్‌రెడ్డి, హరీష్‌రావు, కేటీఆర్‌లు అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయం చర్చించేందుకు ప్రశాంత్‌రెడ్డికి కనువిప్పు కలిగిద్దామనుకుంటే ఆయన రాకుండా హైదరాబాద్‌లో దాక్కున్నాడని విమర్శించారు. దాడులు చేసే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ఆయనన ప్రశ్నించినవారిపై ప్రశాంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. నంగి దేవేందర్‌ రెడ్డిపై దాడికి పరోక్షంగా పురిగొల్పింది ప్రశాంత్‌రెడ్డే అన్నారు. కాంగ్రెస్‌ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం చేతులు ముడుచుకొని కూర్చోను అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై గాని, తనపైగాని నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అహ్మదీ బజార్‌లో ఆక్రమణల తొలగింపు

- అంతుచూస్తామంటూ పోలీసులకు స్థానికుల బెదిరింపు



అహ్మదీబజార్‌లో పర్యవేక్షిస్తున్న పోలీసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీబజారులోని శంభునిగుడి ప్రాంతంలో రోడ్డును అక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్‌ పోలీసులు తొలగించారు. అంతకుముందు రోడ్డుపైన షాపులు, తోపుడు బండ్లను ఏర్పాటు చేస్తే వాహనాదారులకు ఇబ్బందులు ఏర్పడతాయని ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ, సీఐ ప్రసాద్‌, సిబ్బంది దుకాణాదారులకు సూచించారు. అనంతరం ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో అధికారులను కొందరు స్థానికులు చుట్టుముట్టి బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షెహబాజ్‌, హర్షద్‌, మజీద్‌తోపాటు కొంత మంది పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో వెంటనే అదనపు బలగాలను పంపించి వారి చెదరగొట్టారు. రెండో టౌన్‌ ఎస్సై సయ్యద్‌ ముజాహిద్‌ ఘటన స్థలానికి చేరుకొని నలుగురిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై ట్రాఫిక్‌ పోలీసులు రెండో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే కుమార్‌ గల్లీలోనూ రోడ్డుపై ఉన్న ఆక్రమణలను పోలీసులు తొలగించగా దుకాణాదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దుకాణాదారులతో అధికారులు మాట్లాడి, రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలిగించారు.

క్రమశిక్షణ, సమయ పాలనే ప్రధానం



బోధన్‌లోని ఇందూర్‌ హైస్కూల్‌లో సర్టిఫికెట్లు పొందిన ఎన్‌సీసీ విద్యార్థులతో నిజామాబాద్‌ ఎన్‌సీసీ బెటాలియన్‌ కమాండెంట్‌ కల్నల్‌ విష్ణు నాయర్‌, కరస్పాండెంట్‌ కిషోర్‌

బోధన్‌: ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమ శిక్షణ, సమయ పాలన అత్యంత ప్రాధాన్యమని నిజామాబాద్‌ ఎన్‌సీసీ బెటాలియన్‌ కమాండెంట్‌ కల్నల్‌ విష్ణు నాయర్‌ అన్నారు. బోధన్‌ శివారులోని ఆచన్‌పల్లి ప్రాంతంలోగల ఇందూర్‌ హైస్కూల్‌లో శుక్రవారం ఎన్‌సీసీ ‘ఏ’ కాడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణలో నైపుణ్యం సాధించి సైనికులుగా దేశానికి సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్‌ కొడాలి కిషోర్‌ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ యూనిట్‌ ద్వారా అనేక విద్యార్థులు శిక్షణ పొంది ఆర్మీలోని వివిధ హోదాల్లో పని చేస్తున్నారన్నారు. 44 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 50 మంది విద్యార్థులను కొత్తగా నమోదు చేసుకున్నారు. హెచ్‌ఎం రామారావు, ఎన్‌సీసీ సిబ్బంది సుబేదార్‌ అనూజ్‌రాణ, బీహెచ్‌ఎం సతీందర్‌జీత్‌, హవల్దార్‌ శ్రీకాంత్‌,ఏఎన్‌వో సాయిలు, పీఈటీ సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నిజామాబాద్‌ రూరల్‌: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ సాయి చైతన్య అన్నారు. క్యాన్సర్‌ను ఎదుర్కోవాలంటే ముందస్తు వైద్య పరీక్షలతోనే గుర్తించి, చికిత్స తీసుకుంటేనే వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. మాధవనగర్‌లోని క్యాన్సర్‌ ఆస్పత్రిలో శుక్రవారం ‘క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ ప్రోగాం నిర్వహించారు. అలాగే అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి వైద్య విద్యార్థుల కోసం రూపొందించిన ప్రత్యేక ఇంటర్‌షిప్‌ ప్రోగ్రాం ‘‘బ్రిడ్జింగ్‌ బోర్డర్స్‌’’ను ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ముందస్తు వైద్య పరీక్షలు మన జీవితాల నాణ్యతను పెంపొందించగలవన్నారు. అంకాలజీ వైద్యుడు చిన్నబాబు మాట్లాడుతూ.. గ్రేస్‌ క్యాన్సర్‌ ఫౌండేషన్‌, బ్రిడ్జ్‌ గ్యాప్‌ హాస్పిటల్స్‌ సంయుక్తంగా ఉచిత క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంప్‌ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కమిషనర్‌ 8వ ఎడిషన్‌ గ్లోబల్‌ గ్రేస్‌ క్యాన్సర్‌ రన్‌– 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీ రామ్‌ అయ్యర్‌, రచయిత, ప్రభుత్వ పాలసీ సలహాదారు వర్మ జంపానా, డాక్టర్‌ జీవన్‌రావు, ప్రతిమరాజ్‌ పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డిని కలిసిన బిగాల



వేల్పూర్‌: హైదరాబాద్‌లో ఉన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌ రెడ్డిని శుక్రవారం నిజామాబాద్‌ అర్బన్‌ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కలిశారు. వేల్పూర్‌లో గురువారం ప్రశాంత్‌ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్‌ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడుల సంస్కృతికి తెరలేపవద్దన్నారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్‌: మైనార్టీ విద్యార్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మై నార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో బ్యాంకింగ్‌, ఫైనా న్స్‌, సర్వీసెస్‌, ఇన్సూరెన్స్‌ సెక్టార్లలో ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లో మాత్రమే ఉంటుందని తెలిపారు. డిగ్రీలో కనీసం 50శాతం మార్కులు, 26 సంవత్సరాలలోపు తక్కువ వయసు, తల్లిదండ్రుల ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువ ఉండాలని పేర్కొన్నారు. వచ్చే నెల 18వ తేదీ వరకు దరఖాస్తులను గూగుల్‌ ఫా రం ద్వారా సంబంధిత జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ పెంచుకోవాలి

- డీఈవో అశోక్‌



డిచ్‌పల్లి: మారుతున్న కాలానికనుగుణంగా విద్యార్థులు ఇంగ్లిష్‌ కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని డీఈవో అశోక్‌ సూచించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాకతీయ సాండ్‌ బాక్స్‌ దేశ్‌ పాండే ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్‌ ఇన్‌ విలేజ్‌ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లిష్‌, లైఫ్‌ స్కిల్స్‌ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైమరీ, హైస్కూల్‌ హెచ్‌ఎంలు సంధ్యనాయక్‌, సూర్యకుమారి, ఉపాధ్యాయులు, వి ద్యార్థులు, కాకతీయ సాండ్‌ బాక్స్‌ దేశ్‌పాండే ఫౌండేషన్‌ ప్రతినిధులు సాహితీ మేడూరి, మధు ఎడ్ల, గంగాప్రసాద్‌, భానుప్రసాద్‌, రూప, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

నిజామాబాద్‌ లీగల్‌: భార్యను చంపిన కేసులో భర్తకు నిజామాబాద్‌ మొదటి అదనపు జిల్లా కోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన కేలోత్‌ శ్రీనివాస్‌, భార్య సరిత పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్‌ తరచు భార్యతో గొడవ పడుతుండే వాడు. ఈక్రమంలో మార్చి 1, 2025న కుటుంబ పోషణ విషయంలో సరిత తన భర్తతో గొడవ పడింది. అనంతరం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను వెంటనే స్థానికులు అడ్డుకోగా, కొద్దిసేపటికే ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌కు తన కూతురు ఈ ఘటనను వివరించింది. అనంతరం భార్యతో అతడు గొడవపడి గొడ్డలి కామతో కొట్టి చంపి, పరారయ్యాడు. మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన జడ్జి జీవిఎన్‌ భరతలక్ష్మి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ. 5000 జరిమానా విధించింది. పోలీసుల తరఫున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మీనారాయణ వాదించారు.

బైక్‌ చోరీ కేసులో నిందితుడికి 8నెలల జైలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బైక్‌ చోరీకి పాల్పడిన నిందితుడికి 8 నెలల జైలు శిక్ష విధిస్తు ఎల్లారెడ్డి మున్సిఫ్‌ కోర్టు న్యాయమూర్తి సుష్మ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలంలోని రాంపూర్‌ గ్రామానికి చెందిన బాబు తన బైక్‌ను గత ఏడాది జనవరి 4న ఎల్లారెడ్డిలోని వెంకటేశ్వర హాస్పిటల్‌ ఆవరణ ఉంచాడు. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని బేగంపూర్‌తండాకు చెందిన చవాన్‌ సుభాష్‌ సదరు బైక్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా, సాక్షులను విచారించిన అనంతరం సుభాష్‌కు న్యాయమూర్తి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారు.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలు అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని ద్వారకనగర్‌ గంజాయి విక్రయిస్తున్న ఖాజీబీ అహ్మదీబేగం అనే వృద్ధురాలిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏడీ స్వప్న తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఖాజీబీ ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టగా 450 గ్రాములు ఎండు గంజాయిను పట్టుకున్నారు. అలాగే 2 ఫోన్లను స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేశారు. నిందితురాలిపై గతంలో పలు కేసులు ఉన్నాయని, కొన్ని సంవత్సరాలుగా రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది రాజన్న, భూమన్న, శ్రీనివాస్‌, ప్రసాద్‌ శ్యామ్‌ సుందర్‌, కానిస్టేబుళ్లు భోజన్న, సమీర్‌, శివ, గంగారమ్‌, శ్యామ్‌ తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని కేశాపూర్‌ గ్రామంలోగల మహలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ తెలిపారు. ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.15 వేలు, రెండు గ్రాములు బంగారం, రెండు తులాల వెండి అభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు వివరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాటర్‌ ట్యాంకర్‌ బోల్తా



నస్రుల్లాబాద్‌: మండలంలోని జాతీయ రహదారి పనులకు ఉపయోగిస్తున్న వాటర్‌ ట్యాంకర్‌ శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. నీటిని సరఫరా చేసి మళ్లీ నింపుకోవడానికి వెళుతుండగా కామిశెట్టిపల్లి నీలం కట్ట ప్రాంతంలో వాహనం అదుపు తప్పిందన్నారు. డ్రైవర్‌ చాకచక్యంతో దూకేయడంతో ప్రమాదం తప్పిందన్నారు.

‘జెడ్పీ’పై బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు, పాల్గొన్న జిల్లా బీజేపీ నేతలు

సుభాష్‌నగర్‌: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, జెడ్పీపై బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేష్‌ రెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్ని సర్వేలు చెప్పాయని తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తిస్తూ మండలస్థాయిలో పాదయాత్రలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జూలై 29, 30 తేదీల్లో మహా సంపర్క్‌ అభియాన్‌, ఆగస్టు 1, 2, 3 తేదీల్లో మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి బైక్‌ ర్యాలీ చేపట్టాలని, అనంతరం మండల అధికారులకు వినతిపత్రం సమర్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, పసుపు బోర్డు జాతీయ చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, జిల్లా ప్రభారి కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బస్వా లక్ష్మీనర్సయ్య, పెద్దోళ్ల గంగారెడ్డి, వడ్డే మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, స్రవంతి రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే కోనాపూర్‌ దారి దోపిడీ

- ముగ్గురు నిందితుల అరెస్ట్‌
- నగదు, మొబైల్‌ ఫోన్‌లు స్వాధీనం



కమ్మర్‌పల్లిలో వివరాలను వెల్లడిస్తున్న భీమ్‌గల్‌ సీఐ పొన్నం సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్‌ గ్రామ శివారులో బుధవారం జరిగిన దారి దోపిడీ అంతా పథకం ప్రకారమే జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనలో బాధితుడి వెంట వచ్చిన వ్యక్తే కుట్రదారుడు కాగా, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కుట్ర పన్ని దోపిడీకి పాల్పడ్డారు. నిందితులను అరెస్టు చేశారు. కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం భీమ్‌గల్‌ సీఐ పొన్నం సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినపల్లికి చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వరికోత యంత్రం కొనుగోలు చేయడానికి రూ. 3.50 లక్షల నగదుతో భీమ్‌గల్‌ మండలం పల్లికొండకు ఈనెల 16న బయలుదేరాడు. అతడికి తోడుగా తెలిసిన వ్యక్తి బోదాసు జలంధర్‌ను వెంట తీసుకెళ్లాడు. జలంధర్‌ ఆ డబ్బులను కాజేయాలని కుట్ర పన్ని ఈ విషయాన్ని కొన్ని రోజులకు ముందే గుంటూర్‌ జిల్లా సత్తెనపల్లెలో ఉండే వరుసకు అన్నయ్య అయ్యే బోదాసు రాజశేఖర్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. ఈ విషయం రాజశేఖర్‌ తన బావమరిది ప్రసాద్‌కు చెప్పి కుట్రపన్నారు. ఈక్రమంలో జలంధర్‌ వారిని కోరుట్ల ప్రాంతానికి రప్పించాడు. అనంతరం జలంధర్‌ లక్ష్మీనారాయణతో కలిసి బైక్‌పై పల్లికొండకు బయలుదేరారు. కోనాపూర్‌ శివారులోని అటవీ ప్రాంతానికి చేరుకోగానే, అక్కడే మాటు వేసి ఉన్న రాజశేఖర్‌, ప్రసాద్‌లు స్కూటీపై వచ్చి వారి బైక్‌ను అడ్డగించారు. కత్తులు చూపి బెదిరించి లక్ష్మీనారాయణ వద్ద నుంచి రూ. 3.50 లక్షల నగదు, రెండు మొబైల్‌ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. జలంధర్‌పై అనుమానంతో దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక సహాయంతో సమాచారం సేకరించారు. మెట్‌పల్లి లాడ్జీలో ఉన్న జలంధర్‌, బోదాసు రాజశేఖర్‌, ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ. 3.45 లక్షల నగదు, కత్తి, స్కూటీ, మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి పాల్పడింది తామేనని నిందితులు అంగీకరించనట్లు సీఐ పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అనిల్‌రెడ్డిని, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి వాగు నుంచి ఇసుకను తోడి జన్నెపల్లి వైపు వెళ్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే శుక్రవారం వేకువ జామున వాగు నుంచి ఇసుకతో బయటకు వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మాక్లూర్‌ మండలంలో..

మాక్లూర్‌: మండలంలోని మాణిక్‌భండార్‌ చౌరస్తా వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకుని మాక్లూర్‌ పోలీసులకు అప్పగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు నిఘా ఉంచి, టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇసుకతో ఉన్న టిప్పర్‌ తమ ఆధీనంలో ఉందని తదుపరి చర్యల కోసం విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

ఫారెస్ట్‌ అధికారుల అడ్డగింత



వర్ని: వర్ని ఫారెస్ట్‌ రేంజ్‌ పరిధిలోని సిద్దాపూర్‌ అటవీ ప్రాంతంలో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను శుక్రవారం అటవీశాఖ అధికారులు ధ్వంసం చేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న గిరిజనులు వెంటనే వారిని అడ్డుకున్నారు. సుమారు 15 ఎకరాల స్థలంలో గిరిజనులు మొక్కజొన్న పంట వేయగా అటవీ భూమిని కబ్జా చేస్తున్నారని అధికారులు పేర్కొంటూ, ధ్వంసం చేయడానికి యత్నించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసుల్లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ శుక్రవారం కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం నగరంలోని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరు పర్చారు. జడ్జి వారిలో 9 మందికి రూ. 14500 జరిమానా విధించి, ఒకరికి రెండు రోజులు, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఎల్‌కె ఫారమ్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతు పట్టుబడ్డారు. అతడిని పోలీసులు శుక్రవారం నిజామాబాద్‌ కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

బోధన్‌ పట్టణంలో..

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): పట్టణంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా కోటగిరి మండలం సులేమాన్‌ నగర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. అతడిని పోలీసులు శుక్రవారం బోధన్‌ కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వో వెంకట నారాయణ తెలిపారు.